ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	551.10 (212.2070)	63,317	1,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.57 (3.58)	12.73	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.804 (18.9823)	7,898	5,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.210



కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సోమవారం సాయంత్రం జరిగే సభలో ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

నేటి నుంచి కొత్త రేషన్ కార్డులు

నేడు తిరుమలగిరికి

సీఎం రేవంత్‌రెడ్డి



- బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి
- రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం

7

అర్హులందరికీ

రేషన్‌కార్డులు



- ఒకేసారి 5.61లక్షల రేషన్‌కార్డుల పంపిణీ
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

- తిరుమలగిరి సభలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో అత్యధికంగా కొత్త కార్డులు
- ఇకపై నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రకటించిన ప్రభుత్వం

జాతీయ ఆహారభద్రతా చట్టం రూపొందించి అమలులోకి వచ్చిన సందర్భంలో ఆహారభద్రతా కార్డులను అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అడపాదడపా ఒకటి, రెండుతప్ప విస్తృత స్థాయిలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగలేదు. పాత కార్డుల్లో కొత్త కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, అదేవిధంగా కుటుంబాలు విడిపోయిన తర్వాత కొత్త కుటుంబాలకు రేషన్‌కార్డుల పంపిణీ జరగకపోవడంతో ఎన్నికల్లో ఇది ప్రధాన అంశంగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియను చేపట్టింది. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. వెరిఫికేషన్ ప్రక్రియను సైతంనిర్వహించి కొత్తకార్డులు అందించేందుకు రంగం సిద్ధం చేశారు.

పాత, కొత్త దరఖాస్తుల నుంచి వడపోత

కొత్త రేషన్‌కార్డులను ఈనెల 14 నుంచి అధికారికంగా పంపిణీ చేయనున్న నేపథ్యంలో అందుకోసం భారీగా వచ్చిన దరఖాస్తులను వడపోశారు. గతంలో మీ-సేవా కేంద్రాల ద్వారా చేసుకున్న దరఖాస్తులతో పాటు, ప్రజాపాలన దరఖాస్తులు, ఇటీవల సేకరించిన దరఖాస్తులను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చిన నివేదికల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే పలు ప్రాంతాల్లో కార్డు ఉన్నవారికి, ఇన్‌కమ్ ట్యాక్స్ పేయర్స్‌కు, పట్టణ ప్రాంతాల్లో భవనాలు ఉన్నవారికి, ఐదెకరాల పైచిలుకు భూములు ఉన్నవారికి, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికి సైతం రేషన్‌కార్డు ఇస్తున్నారని, దీనిపై మరోసారి పరిశీలన చేయాలనే ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రధానంగా రెవెన్యూశాఖలో వీఆర్‌వోలు

- మిగతా 7వ పేజీలో...



నల్లగొండలో బోనాలు తీసుకెళ్తున్న ప్రజలు

వైభవంగా ఆషాఢ మాస బోనాలు

నల్లగొండ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు బైపాస్‌లోగల కల్యాణ కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం ఆషాఢ మాస బోనాల మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరీదేవీగా అలంకరించి పూజలుచేశారు. పలువురు మహిళలు కూరగాయల మాలలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. దీంతో ఆలయమంతా భక్తులతో సందడిగా మారింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ జెర్రిపోతుల సైదులు, పద్మ, కార్తీక్, శ్రీనివాస్, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.



కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆషాఢమాసం మూడో ఆదివారం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలుచేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. చీర సారె, ఒడిబియ్యం బోనం నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

గీత కార్మికులు అన్నిరంగాల్లో రాణించాలి



గోపా సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న

గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయన్న

నల్లగొండ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడు సాయన్న అన్నారు. నల్లగొండలోని గౌడ హాస్టల్‌లో జరిగిన జిల్లా గోపా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలం మారుతున్నా గీత కార్మికులు సామాజికంగా ఎదగలేకపోతున్నారన్నారు. గీత కార్మికుల అభ్యున్నతికి మేధావులు, ఉన్నతస్థాయిలో ఉన్నవారు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1970లో గోపా ఏర్పడిందన్నారు. నాటినుంచి గౌడ సామాజికవర్గం అభివృద్ధికోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చెక్కిళ్ళ మధుసూదన్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరేకంటి కాశయ్య మాట్లాడుతూ గౌడ కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. దంతూరి సైదులు గౌడ్, నకరికంటి శ్రీనయ్యగౌడ్, సిద్దగోని పరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జనగాం రవీందర్‌గౌడ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రాంబాబుగౌడ్, మీనయ్యగౌడ్, జి వేణుబాబుగౌడ్, జాజుల లింగంగౌడ్, సోమశేఖర్‌గౌడ్, తండు కృష్ణ చైతన్యగౌడ్, దూసరి కిరణ్‌గౌడ్, నిమ్మల పిచ్చయ్యగౌడ్, ఎరుకల శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపా జిల్లా నూతన అధ్యక్షుడిగా దంతురి సైదులు గౌడ్‌ను ఎన్నుకున్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌డేను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

మూసీ కుడి, ఎడమ కాల్వలకు 7

సాగునీటి విడుదల 18న

- రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ (స్కివమ్) సమావేశంలో నిర్ణయం!
- ఇప్పటికే ఆయకట్టులో నార్లు
- సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు

జోరుగా కల్తీ విక్రయాలు

» సూర్యాపేట జిల్లాలో అన్నింటా కల్తీ » సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

సూర్యాపేట పట్టణంలో జోరుగా కల్తీ విక్రయాలు జరుగుతోన్నాయి. తినే తిండి నుంచి తాగే పాల వరకు ప్రతి ఒక్కటి కల్తీమయమవుతుంది. ఏదీ తినాలన్నా..ఏదీ తాగాలన్నా.. ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. నకిలీ ఏదో.. అసలు ఏదో తెలియని పరిస్థితి దాపురించింది. దీంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా అనారోగ్యాల బారిన పడుతున్నారు. కల్తీని నిరోధించాల్సిన ఆహార నియంత్రణ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి- సూర్యాపేట టౌన్)



సూర్యాపేటలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

సూర్యాపేట జిల్లా కల్తీకి అడ్డాగా మారింది. కేవలం ఫిర్యాదులు వస్తేనే ఆహార కల్తీ నిరోధక శాఖ దాడులు చేస్తుంది తరచుగా తనిఖీలు చేస్తే దుకాణాల, హోటల్ నిర్వాహకులకు భయం ఉంటుంది. కొన్ని హోటల్‌లో రెండు, మూడు రోజులు వరుసగా భోజనం చేస్తే జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. సూర్యాపేట పట్టణంలోనే పలు హోటళ్లనుఇటీవల ఆహార భద్రత అధికారులు, మునిసిపల్ అధికారులు తనిఖీ చేయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

కల్తీ ఇలా..

అధికారులు దుకాణాలను తనిఖీలుచేసి కల్తీ లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ ఎప్పుడో ఒకసారి మాత్రమే దుకాణాలను తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వ్యాపారులు కల్తీ చేస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ప్రముఖ కంపెనీలకు సంబంధించిన టీ పొడి ప్యాకెట్లు కూడా కల్తీవి విక్రయిస్తున్నారు. అంతేకాక మరో అడుగు ముందుకు వేసి సూ ర్యాపేట జిల్లా కేంద్రంలో రంపపు పొడితో పలు రకాల రంగులు, రసాయనాలు కలిపి నకిలీ టీపొడిని కూడా తయారు చేస్తూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు తెలియని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

బ్రాండెడ్ ఆయిల్ కంపెనీల పేరుకు కొద్దిగా దగ్గరగా చేర్చి కల్తీ విక్రయాలకు పాల్పడుతున్నారు. కొందరు వ్యాపారులు విడి నూనెలో కల్తీ చేస్తున్నారు. వేరుశనగ నూనెను కొనడానికి గ్రామీణులు సూర్యాపేట మార్కెట్‌కి వస్తారు. వేరుశనగ నూనెలో కూడా కల్తీచేసి విక్రయిస్తున్నారు.

రెండోరకం వస్తువుల విక్రయాలు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డులో కొందరు దుకాణదారులు ప్రతిది రెండోరకం వస్తువును విక్రయిస్తున్నారు. కంది, శనగపప్పు, పెసరపప్పు, పంచదార, మినపప్పు మొదలైన వాటిని రెండోరకం ఉంటుంది. నాణ్యమైన పప్పులకు ఒక ధర ఉంటే రెండోరకం నాణ్యత కలిగినవాటికి తక్కువధర ఉంటుంది. ప్రతి పప్పుకు కిలో రూ.20 నుంచి 30దాకా తేడా ఉంటుంది. తక్కువ ధర అని చెబుతూ వినియోగదారులకు అంటగడుతున్నారు.

మినీ ల్యాబ్‌లో నిమిషాల్లో కల్తీ గుర్తింపు

గతంలో కల్తీ పదార్థాలను గుర్తించడానికి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించేవారు. ప్రస్తుతం వెంటనే ఫలితాలు వచ్చే పరికరాలు రావడంతో ఫలితాలు నిమిషంలో వస్తున్నాయి. దీంతో కల్తీ పదార్థాలను వెంటనే గుర్తించే అవకాశం ఉంది. ముఖ్యంగా మినీ ల్యాబ్ వాహనం అందుబాటులోకి రావడంతో ఫలితాలు వెంటనే వస్తున్నాయి. జిల్లాలో పలు హోటళ్లు కిరాణ దుకాణాలు, బేకరీలు తనిఖీ చేసి జిల్లాలో 6 నెలల నుంచి సుమారు 15 హోటళ్లకు ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. కోదాడలో నాసిరకం అల్లం, వెల్లుల్లి విక్రయించే దుకాణాలకు కూడా నోటీసులు ఇచ్చారు. వాటిని తీసుకెళ్లిన హోటళ్లకు నోటీసులు ఇచ్చారు. కిరాణా, సూపర్‌మార్కెట్లను తనిఖీలు చేశారు. మునిసిపాలిటీ సిబ్బంది జిల్లా కేంద్రంలో రెండు బేకరీలకు కలిపి రూ. 6 వేలు జరిమానా విధించారు.

కల్తీకి పాల్పడితే చట్టపరంగా చర్యలు..

వస్తువులను కల్తీ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యాలకు హానీ కలిగించే విధంగా ఎవరు వ్యవహరించిన చట్టపరంగా శిక్ష అనుభవిస్తారు. జిల్లాలో కల్తీ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఆకస్మిక దాడులు చేస్తాం. అదనపు కలెక్టర్ కోర్టులో హోటళ్ల, కిరాణ,మిల్క్ దుకాణాలకు సంబంధించి 22కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

-కిరణ్, ఇన్‌చార్జి.ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సూర్యాపేట

మచ్చుకు కొన్ని..

- దురాజ్‌పల్లి పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన బిర్యానీ సెంటర్‌లో బిర్యానీలో ఈగలు రావడంలో మునిసిపల్ అధికారులు హోటల్ నిర్వాహకుడికి జరిమానా విధించారు.
- జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో వెంట్రుకలు, ఈగలు రావడంతో మునిసిపల్ అధికారులు రూ. 5వేలు అపరాధ రుసుము వసూలు చేశారు.
- బేకరీ నిర్వహకుడు కేక్‌లో మోతాదుకు మెంచి కలర్ వాడడంతో మహిళా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైంది.
- ఇటీవల జిల్లా కేంద్రంలో పలు టీస్టాల్స్, హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయగా టీ పొడి కల్తీని గుర్తించి వాటిని వెంటనే వినియోగించకుండా మురుగుకాల్వల్లో పడేశారు. వంటగది అపరిశుభ్రంగా ఉండడం, ఈగల వ్యాప్తి పలుసార్లు మరి గించిన 10 లీటర్ల నూనెను ప్రతిరోజు వాడుతున్నారు. ఎలాంటి భద్రత లేకుండా సుమారు రూ. 14 వేల విలువైన చికెన్ పదార్థాలను నిల్వ ఉంచడంతో ఉమ్మడి జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. రుచికోసం ప్రధానంగా మటన్, చికెన్, ఫిష్ బిర్యానీలో హానికరమైన రంగులు, మసాలాలు, టేస్టీసాల్ట్‌లు నేరమని నిర్వాహకులకు ఆమె తెలిపారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పచ్చళ్లు నిల్వ ఉంచారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్‌లు నిర్వహిస్తున్న నిర్వహకులకు నోటీసులు జారీ చేశారు.

నేడు, రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

నల్లగొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సోమ, మంగళవారాల్లో ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన తర్వాత తొలిసారి ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వస్తుడటంతో ఘనస్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్‌కు చేరుకున్న తర్వాత ఆయనకు పార్టీ శ్రేణులు స్వాగతం పలకనున్నాయి. 10 గంటలకు నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాలలో, 11 గంటలకు నార్కట్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం పలకనున్నారు. నల్లగొండ పట్టణంలోని వీటీకాలనీలో ఉన్న శ్రీదేవి భూ దేవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11.30 గంటలకు పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత 12గంటలకు న్యాయవాదులు, డాక్టర్లతో సమావేశం కానున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా గడియారం సెంటర్‌కు ఆ తర్వాత రామగిరి, శివాజీ నగర్ నుంచి చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 1.30 గంటలకు జరిగే పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారు.

అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు సూర్యాపేట చేరుకొని బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించి 4.30 గంటలకు కార్యకర్తలతో సమావేశం కానున్నారు. రాత్రి 7 గంటలకు రామచంద్రరావు కోదాడ నియోజకవర్గంలోని సొంత గ్రామమైన నల్లబండగూడెంలో గ్రామస్థులతో మాట్లాడుతారు. 15వ తేదీన కోదాడలో 9.30 గంటలకు కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చౌటుప్పల్ మండలం అవుషాపూర్‌లో స్థానిక సంస్థలపై నిర్వహించనున్న వర్క్‌షాపులో అధ్యక్షుడు పాల్గొంటారు.

'కాల నాళిక' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, చిత్రంలో రచయిత శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత ముక్కా శ్రీనివాస్ రాసిన 'కాల నాళిక' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. తెలుగు సాహితీ వనం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కలెక్టర్, ఏనుగు నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ యుగంలో రచయితలు, సాహితీ మిత్రులు కవితలు, రచనలపై దృష్టి సారిస్తూ పఠనాసక్తి పెంచేంతూ కృషి చేయడం గొప్ప విషయమన్నారు. యువత స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని, సంస్కృతీ, సాహిత్యాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రచయిత శ్రీనివాస్ మాట్లాడుతూ మనసులోని భావాలను అందమైన అక్షరాలుగా అల్లి 'కాల నాళిక' పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. గజల్ రచయిత కోరప్రోలు మాధవరావు తదితరులు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

క్రీడా అకాడమీలో ప్రవేశానికి రేపటి నుంచి పోటీలు

నల్లగొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ, అథ్లెటిక్స్, హ్యాం డ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడా అకాడమీ 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఈనెల 15, 16 తేదీల్లో ఎల్‌బీ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నల్లగొండ డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 12 నుంచి 16 ఏళ్ల వయస్సు బాల, బాలికలు ఈ నెల 15వ తేదీన ఉదయం 7 గంటలకు సంబంధిత ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో ఎల్‌బీ స్టేడియానికి హాజరుకావాలని, వివరాలకు 8074487020 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చౌడంపల్లి వాసికి ఉస్మానియా డాక్టరేట్



ఆంజనేయులు

నార్కట్‌పల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన దామెర ఆంజనేయులుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జియాలజీ విభాగంలో 'శిలల వయస్సు, కంపోజిషన్' వాటి ప్రాముఖ్యత అనే అంశంపై సీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఈవీఎస్‌కే బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కె.శ్రీను ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ ఆంజనేయులుకు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆంజనేయులు ప్రస్తుతం సెంట్రల్ వాటర్ బోర్డు పరిధి కర్ణాటక రాష్ట్రంలో హైడ్రోజియాలజిస్టు (క్లాస్-1 గెజిటెడ్) అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. చౌడంపల్లిలో ఉదయసముద్రం రిజర్వాయర్ జలాలు చౌడంపల్లి ఊర చెరువుకు రీచార్జీ కాకపోవడానికి శిల అడ్డువస్తుందని కనుగొన్న ఆంజనేయులకు డాక్టరేట్ రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, జూలై13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ వరుస సెలవు దినాలు కావడంతో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు. దీంతో పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, కొత్త వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు లాంచీ టిప్పులు నడిపారు.



లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు

మర్రిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో యువకుడిపై కేసు నమోదైంది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో అదే గ్రామానికి చెందిన యువకుడు డానియెల్ గత నెల 28న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదులో తెలిపారు. బాధితురాలి తల్లి శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

పెద్దఅడిశర్లపల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. అజ్మాపురం గ్రామానికి చెందిన తాటికోలు అంకుల్ ఇటీవల పీఏసీఎస్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి రిటైర్ కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం పీర్ల పండుగ ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రసాదాలు పెడుతుండగా ఇంట్లో నుంచి బయటకు వచ్చిన అంకులయ్యను ఒక్కసారిగా కోతుల దండు దాడి చేశారు. దీంతో చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కోతులను చెదరగొట్టడంతో అంకులయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గాయపడిన అంకులయ్యను దేవరకొండకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి అనంతరం వ్యాక్సిన్ కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అయితే గ్రామంలో కోతుల సమస్య అధికంగా ఉందని, కొన్ని నెలల వ్యవధిలోనే చాలామంది కోతుల బారిన పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కోతుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వలిగొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎం తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి శ్రీశైలం(45) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మూటకొండూరు మండలం చాడగ్రామంలో తన భార్య అమ్మమ్మ దశదినకర్మ జరగనుంది. ఈ నేపథ్యంలో అతని కుటుంబసభ్యులు ముందుగానే అక్కడికి వెళ్లారు. శ్రీశైలం ఇంట్లో నిద్రిస్తుండగా ఆ గ్రామానికి చెందిన సమీప బంధువు మాసంపల్లి లక్ష్మయ్య ఇంట్లోకి వచ్చి దశదినకర్మకు వెళ్లడానికి అతని నిద్ర లేపాడు. ఎంతకూ నిద్ర లేవకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. వెంటనే వారి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలకు వెనుకభాగం, ఎడమ కంటిలో రక్తపు గాయాలు ఉన్నట్లు గమనించారు. మద్యం తాగి కిందపడి మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

ఆత్మకూరు(ఎం) జూలై 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మారుపాక మల్లయ్య అనే రైతు ఆదివారం వ్యవసాయ బావి వద్ద తన పాడి గేదెను మేత కోసం బయటకు వదిలిపెట్టాడు. గేదె మేసుకుంటూ పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరుకు తగిలింది. ఎ ర్తింగ్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు యల్లయ్య తెలిపాడు. రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రవి సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.



పంచనామా నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారి

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

● స్వామివారిని దర్శించుకున్న 40వేల మంది భక్తులు ● దర్శనానికి మూడు గంటల సమయం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండకింద లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 40వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య పూజలు ఘనంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ ఆలయం పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదా రీతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.53,64,989ల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏపీ మంత్రి కె.పార్థసారథి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి దేవస్థానం ఈవో వెంకటరావు ఆధ్వర్యంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా ఉప కార్యనిర్వహణాధికారి దొర్బల భాస్కర్‌శర్మ లడ్డూ ప్రసాదం అందజేసి స్వామివారి ప్రతిమను బహూకరించారు.



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

చిట్యాలరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలికట్టె గ్రామ శివావరులో వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ఇస్మాయిల్‌పల్లికి చెందిన మాద నర్సింహ(50) భవన నిర్మాణ పనిలో భాగంగా సెంట్రింగ్ పని చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన మునుగోడుకు వెళ్లి తన ద్విచక్రవాహనంపై తిరిగి సాయంత్రం నార్కట్‌పల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఎలికట్టె గ్రామ శివారలోకి చేరుకోగానే మునుగోడు వైపునకు వెళుతున్న వాహనం వేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సింహకు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ నర్సింహ శనివారం రాత్రి మృతిచెందాడు. నర్సింహ కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెన్‌పహాడ్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తండ సైదులు(29) రోజువారి పనినిమిత్తం సూర్యాపేటకు వెళ్లి తిరిగి ఇంటికి ఆటోల వస్తున్న క్రమంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అనంతారం గ్రామ శివారు గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న గేదెలను తప్పించబోయి ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న తండు సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటనారాయణ తెలిపారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

కనగల్, జూలై 13(ఆంధ్రజోతి): హైదరాబాద్‌లో ఆగస్టు 3వ తేదీన నిర్వహించనున్న ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలుగు వెంకటయ్య కోరారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఆవిర్భావసభకు ఎరుకల మేధావులు, విద్యావంతులు సంఘం నాయకులు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు నిర్మల, పద్మ, రామలింగమ్మ, అంజయ్య, నర్సింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.







విరాజిల్లిన వెలుగులు

అంతర్జాతీయ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో విద్యుత్ వెలుగులు లేక గర్భాలయంలో కొన్ని రోజులుగా అంధకారం నెలకొంది. బంగారు వర్ణంలో ఆకర్షణీయంగా కనువిందు చేసే గర్భాలయం వీక్షణకు భక్తులు దూరమయ్యారు. దీంతో 'విరజిల్లని వెలుగు' శీర్షికన ఈ నెల 10వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. అధికారులు గర్భాలయంలో జూమార్ లైట్లను వెలిగించారు. దీంతో విద్యుత్ కాంతులతో ఆలయానికి ప్రత్యేక శోభ సంతరించుకుంది. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్- యాదాద్రి

నేడు తిరుమలగిరికి సీఎం రేవంత్‌రెడ్డి

- రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం
- బహిరంగ సభకు సర్వం సిద్ధం
- 1200 పోలీసులతో భద్రత కట్టుదిట్టం



తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభా వేదిక

తిరుమలగిరి, జూలై 13: తిరుమలగిరిలో సోమవారం జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టను న్నారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సుమారు 10 ఎకరాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. బహిరంగ సభా స్థలం వద్ద అధికారులు రెండు హెలీప్యాడ్లను సిద్ధం చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలీప్యాడ్‌లో ప్రయాణించి నేరుగా తిరుమలగిరి నిర్వహించే సభకు మధ్యాహ్నం మూడు గంటలకు చేరు కుంటారని అధికారులు తెలిపారు. వర్షం పడినా ప్రజలకు ఇబ్బంది లేకుండా మొత్తం మూడు వాటర్‌ప్రూఫ్ షెడ్లు ఏర్పాటు చేశారు. ఈ సభకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారని సమాచారం. సభకు హాజరయ్యే మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్ల ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యాన్ని అధికారులు కల్పించారు. అదే విధంగా వైద్య సిబ్బంది, అంబు లెన్సులు, ఫైర్‌ఇంజన్లు అందుబాటులో ఉంచనున్నారు.

మూడు వాటర్‌ప్రూఫ్ షెడ్లు ఏర్పాటు

సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభ వద్ద మూడు వాటర్‌ప్రూఫ్ షెడ్లు ఏర్పాటు చేశారు. ఎడమ, కుడివైపు, షెడ్లలో ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. సీఎంను వీక్షించేందుకు పెద్దపెద్ద స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. సీఎం, మంత్రులకు సభావేదికను మధ్యలో సిద్ధం ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు వీవీఐపీలు, వీఐపీలకు కూర్చోవడానికి మధ్య షెడ్లలో ఏర్పాట్లు చేశారు.

సభకు పటిష్ఠ బందోబస్తు: ఎస్పీ నరసింహా



ఎస్పీ నరసింహా

సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నరసింహా తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు బందోబస్తులో నలుగురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 33మంది ఇన్‌స్పెక్టర్లు, 110మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 185మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 650మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, రోప్ టీమ్స్, మఫ్టీ టీమ్స్ పనిచేస్తాయని తెలిపారు.

ట్రాఫిక్‌జాం కాకుండా పార్కింగ్ ప్రదేశాల కేటాయింపు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బహిరంగ సభ సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు పార్కింగ్ ప్రదేశం నుంచి సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. సభకు వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు, డీసీఎంలు, కార్లు, ఆటోలు, బైక్‌లకు వేర్వేరుగా పార్కింగ్ కల్పించినట్లు తెలిపారు. ట్రాఫిక్‌జాం కాకుండా వివిధ కూడళ్లలో విధుల్లో ఉన్న పోలీసుల సూచనల ప్రకారం పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

బహిరంగసభను విజయవంతం చేయాలి

ఉండ్రుగొండ గిరి దుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తియాదవ్



మాట్లాడుతున్న డాక్టర్ పూర రామ్మూర్తియాదవ్

భానుపురి, జూలై 13(ఆంధ్రజ్యోతి) తిరుమలగిరిలో సోమవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఉండ్రుగొండ గిరి దుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పూర రామ్మూర్తియాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నాయకత్వంలో 100 వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు తిరుమలగిరి తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జ్యోతికర్ణాకర్, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్‌గౌడ్, వల్దాస్ దేవేందర్, యాట వెంకన్న, ధర్మానాయక్, కొండల్, అరుణ్, శాంతకుమార్, కమల్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు ఫలించేనా?

- ఎమ్మెల్యే సామేలు ఏమేం అడుగుతారు
- సీఎం ఎన్నింటికి హామీ ఇస్తారోనని ప్రజల ఎదురుచూపులు
- తుంగతుర్తి నియోజకవర్గంలో సీఎం అధికారిక పర్యటన ఇదే తొలిసారి
- ఉమ్మడి జిల్లాలో పెద్ద నియోజకవర్గం
- అభివృద్ధిలో వెనుకబాటు




అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో సీఎం అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరికి గతంలో కేసీఆర్ మూడు సార్లు వచ్చినా ఒక సారి పార్టీ అధినేతగా, మిగతా రెండు సార్లు సీఎంగా వచ్చినా అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనడానికే వచ్చారు. అప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నా ప్రభుత్వ అధికార పర్యటనలు కావు. ఈ నెల 14వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గానికి తొలిసారి అధికారికంగా వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరుమలగిరిలో ప్రభుత్వ పరంగా కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వస్తే ఏవో కొన్ని హామీలు నెరవేర్చి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నది ఎమ్మెల్యేల, ప్రజల విశ్వాసం. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో కొన్ని హామీలు తీసుకోవాలన్న పట్టుదలతో నియోజకవర్గానికి రప్పిస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గం సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలకు విస్తరించి 9 మండలాలతో ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గంగా ఉంది. అభివృద్ధిలో మాత్రం అత్యంత వెనుకబడి ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత సీఎం కేసీఆర్ తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని, రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ చేస్తామని, తిరుమలగిరి మండలానికి దేవాదుల నీరు అందిస్తామని, మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని తిరుమలగిరి ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇచ్చారు. వాటిలో తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం హామీ మాత్రమే అమలు నోచుకుంది. మిగతా హామీలు అటకెక్కాయి. ఇప్పటికే రూ.1400 కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్టు చెబుతున్న ఎమ్మెల్యే సామేలు సీఎంరేవంత్‌రెడ్డితో నియోజకవర్గ అభివృద్ధికి మరో రూ. వెయ్యికోట్ల నిధులు మంజూరు చేయించుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సామేలు ఏఏ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏ మేరకు హామీలు ఇస్తారోనని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఎస్సారెస్పీ కాల్వ

సమస్యలు ఇవి...



- ఇప్పటికే నిధులు మంజూరైన మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగునీరు అందించే బునాదిగాని (ధర్మారం) కాల్వ నిర్మాణం పూర్తి చేసి, ఈ కాల్వను బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేయడం.
- తుంగతుర్తి మండలం రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ చేయడం.
- కళాశాలలు అందుబాటులో లేక, ప్రైవేటు కళాశాలలకు వెళ్లలేక పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నందున మోత్కూరు, తుంగతుర్తి మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం. సాంకేతిక విద్యనందించడానికి నియోజకవర్గంలో కనీసం రెండు పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయడం.
- మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల ప్రజలకు వైద్యం, పోస్టుమార్టం సౌకర్యం అందుబాటులో ఉండేలా మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడం.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒకే ఒక్క ఆర్టీసీ బస్సు డిపో ఉన్నందున జిల్లాలో రెండో ఆర్టీసీ బస్సుడిపో మోత్కూరులో ఏర్పాటు చేయడం.
- తిరుమలగిరి మండలానికి చెన్నూరు రిజర్వాయర్ నుంచి దేవాదుల నీరు అందించడం. ›› యాదాద్రి జిల్లాలో మోత్కూరు, సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి మండలాలను రెవెన్యూ డివిజన్లు చేయడం.
- నూతనకల్ మండలం మాచనపల్లి-ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం కాకరవాయి గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగుపై వంతెన నిర్మాణం. ఈ వంతెన నిర్మాణంతో ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం చాలా మెరుగవుతుంది.
- యువతకు ఉపాధి కల్పనకు అడ్డగూడూరు మండలం డి.రేపాక గ్రామంలో ఉన్న 80ఎకరాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయడం. ››తిరుమలగిరిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడం.
- తుంగతుర్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడం.
- మోత్కూరులో కోర్టు, పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయడం.
- మోత్కూరు బిక్కేరు వాగుపై శిథిలమైన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేయడం.
- నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం.

ఇట్లు
తుంగతుర్తి నియోజకవర్గం

ఎస్సారెస్పీ కాల్వకు బీఎన్‌రెడ్డి పేరుపెట్టాలి

- సూర్యాపేట జిల్లా ప్రజల ఆకాంక్ష

తిరుమలగిరిరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాల్వకు స్వర్గీయ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని సూర్యాపేట జిల్లా ప్రజల బలమైన కోరిక. శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వ నిర్మాణం ద్వారా నీటిని సాధించి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గం వ్యవసాయ కూలీల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో నిరంతరం అప్పుడున్న ప్రభుత్వాలతో కలబడి, నిలబడి కాల్వ సాధించి అమరులైన భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు ఆ కాల్వకు బీఎన్ కాల్వగా నామకరణం చేయాలన్నదే ఇక్కడి ప్రజల ఆకాంక్ష.

ఎస్సారెస్పీ కాల్వ కోసం పోరాటం

తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలు అభివృద్ధి సాధించాలంటే ఎస్సారెస్పీ కాల్వ నీరే శాశ్వత పరిష్కారమని, దానిని సాధించడానికి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి తాను జీవించినంత కాలం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రజాచైతన్యంతో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పీవీ నర్సింహారావు జల వనరులశాఖ మంత్రి శంకరానంద్‌తో క్లియరెన్స్ తెప్పించి 1996 మార్చి 6న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తిరుమలగిరి మండలంలోని ప్రగతినగర్ వద్ద అప్పుడు ఎంపీగా పనిచేస్తున్న భీమిరెడ్డి నర్సింహారెడ్డి శంకుస్థాపన చేయించారు. తాను జీవించినంత కాలం కాల్వ కోసం పోరాటం చేసిన త్యాగజీవి బీఎన్ అని, తాను ప్రయత్నం చేసిన కాల్వ నిర్మాణ పనులు చూసి, కాల్వకు నీరు రాకముందే 2008 మే 9న తుది శ్వాస విడిచారు.

మూడు నియోజకవర్గాలకు సాగునీరు

తుంగతుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 94 వేల ఎకరాలు, సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్, ఆత్మకూరు(ఎస్), చివ్వెంల, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలంలో 1.20లక్షల ఎకరాల భూమిని సాగు నీరు అందుతుంది. దీనికి బీఎన్ చేసిన కృషే మూల కారణమని చెప్పవచ్చు.

పేరు పెట్టాలని ఆకాంక్ష

ఎస్సారెస్పీ కాల్వ కోసం నిరంతరం కృషి చేసిన బీఎన్ పేరు కాల్వకు పేరు పెట్టాలని నియోజకవర్గ ప్రజల కోరిక. ప్రజల నాడి తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరును అడగకుండానే పెట్టారు. అంతేకాక రాష్ట్ర మహిళా కమీషన్‌లో ఐలమ్మ మనవరాలికి అవకాశం కల్పించడం, సాంస్కృతిక సారథి చైర్మన్‌గా గద్దర్ కుమార్తె ను నియమించడం, విద్యా కమిషన్‌లో ఆకునూరి మురళిని నియమించడం, ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం లాంటి గొప్ప పనులు చేశారు. అలాగే ఎస్సారెస్పీ కాల్వకు బీఎన్ పేరు పెట్టి ఇక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో ఎన్నో మంచి పనులు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సారెస్పీ కాల్వకు బీఎన్ పేరు పెట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల మన్ననలు పొందాలన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో విఫలం

- పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు

సూర్యాపేటఅర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ప్రొగ్రెసీవ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగం సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా, బ్రాండ్ ఇండియా పేరుతో ఆర్భాటం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను, గురుకులాలను, సంక్షేమ హాస్టళ్లను మూసివేసే పరిస్థితి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, అజయ్, శ్యాం, మహేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



తిరుమలగిరిలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

తిరుమలగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరకీ రేషన్ కార్డులు అందజేయడమే ప్రభుత్వం లక్ష్యమని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రారంభించబోయే రేషన్ కార్డుల పంపిణీ సభాస్థలం వద్ద ఆదివారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఎస్పీ నరసింహాతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కసరత్తు చేశామని తెలిపారు.

తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఒకే సారి పెద్ద మొత్తంలో 5లక్షల61వేల రేషన్‌కార్డులు ఇవ్వడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. అంతేకాక 27.83 లక్షల యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి గాను ఏడాదికి ప్రభుత్వం మీద రూ. 1150 కోట్ల భారం పడుతుందన్నారు. గతంలో 2.81 కోట్ల మంది జనాభాకు రేషన్‌కార్డులు ఉన్నాయని, ఇప్పుడు 3.10 కోట్ల మంది జనాభాకు రేషన్‌కార్డులు పెరుగుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సన్నబియ్యం అందించడానికి రేషన్‌కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రజావాణి, ప్రజాపాలన, మీసేవల ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

జిల్లాలో 23,870 రేషన్ కార్డులు : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట జిల్లాలో నూతనంగా 23,870 రేషన్‌కార్డులు పెరిగినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ మేరకు 72,802 యూనిట్లు పెరిగాయన్నారు. ఇంతకుముందు 3.24,160 కార్డులు ఉండేవని, 9.31లక్షల యూనిట్లు ఉండేవని పేర్కొన్నారు. కొత్తగా పెరిగిన వాటితో 3.50 లక్షల కార్డులకు చేరుకుంటాయని, 10.57 లక్షల యూనిట్లు పెరుగుతాయని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మొత్తం 61,641 రేషన్‌కార్డులకు 1.87 లక్షల యూనిట్లు ఉండగా కొత్తగా 4230 రేషన్‌కార్డులకు మరో 13వేల యూనిట్లు పెరిగినట్లు ఆయన వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీపీఆర్వో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త రేషన్‌కార్డులు

(5వపేజీ తరువాయి)

లేకపోవడంతో ఆర్ఐలే పరిశీలన బాధ్యతలు చూడడంతో వీఆర్ఏలపై ఆధారపడి లేక రాజకీయ నాయకుల సిఫార్సుల మేరకు అర్హుల జాబి తా తయారు చేసినట్టు పలు మండలాల్లో ఆరోపణలు వస్తున్నా యి. దరఖాస్తులను 13వ తేదీలోగా వందశాతం క్లియర్ చేయాలనే ఒత్తిడిలో అర్హుల పరిశీలనలో పారదర్శకత పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. అర్హులకే రేషన్‌కార్డులు ఇస్తే ఆహారభద్రత చట్టం ప్రయోజనం నెరవేరుతుందని, ఈ దిశగా ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 5.60లక్షల రేషన్‌కార్డులు ఇస్తుండగా, అందులో అత్యధికంగా నల్లగొండ జిల్లాకు సంబంధించినవే 50వేల పైచిలుకు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సోమవారం నుంచి కొత్తగా 1.33లక్షల రేషన్‌కార్డులు అందుబాటులోకి రానున్నాయి. వీరందరికీ సెప్టెంబరు కోటా నుంచి రేషన్‌బియ్యం పంపిణీ చేస్తారు. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ లబ్ధిదారుడికి ఆరుకిలోల చొప్పున సన్నబియ్యం ప్రతినెలా ఇస్తారు. సన్నబియ్యం ఇస్తున్నప్పటి నుంచి రేషన్‌బియ్యాన్ని లబ్ధిదారులు ఠంచన్‌గా తీసుకుంటున్న నేపథ్యంలో అర్హులైన కుటుంబీకులు కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.



జిల్లా	పాత కార్డులు	కొత్త కార్డులు	మొత్తం	మొత్తం యూనిట్లు
నల్లగొండ	4,15,040	51,060	4,66,100	16,80,916
సూర్యాపేట	3,24,165	46,965	3,71,130	11,04,832
యాదాద్రి	2,16,831	35,368	2,52,199	7,73,871
మొత్తం	9,56,036	1,33,393	10,89,429	35,59,619

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం చేపట్టింది. అర్హులైన వారు, కొత్తగా నమోదయ్యేవారు ఎప్పటికప్పుడు వారి దరఖాస్తులను మీ-సేవా కేంద్రం ద్వారా, లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి అర్హులని తేలితే కార్డులు జారీ చేస్తాం. ప్రస్తుతం ప్రజాపాలన, మీ-సేవ, ఇటీవల తీసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను రూపొందించి కలెక్టర్ ఆమోదానికి పంపాం. కొత్తగా జారీ అయ్యే కార్డులకు వచ్చే సెప్టెంబరు నెల నుంచి రేషన్ కోటా కేటాయిస్తాం.

\- హరీష్, నల్లగొండ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

మూసీ కాల్వలకు సాగునీటి విడుదల 18న?

- అధికారుల నిర్ణయం

కేతేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ఈ నెల 18వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ (స్కైవమ్) సమావేశంలో ఈ మేరకు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్ నీటిమట్టం వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే నాటికి 641 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరడంతో నీటి విడుదల చేయాలని ఆయకట్టు రైతుల నుంచి మూసీ అధికారులకు విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ క్రమంలో రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తులతో పాటు ప్రాజెక్టు నిండా నీళ్లు... ఆయకట్టులో కన్నీళ్లు... శీర్షికన ఆంధ్రజ్యోతి మినీలో శుక్రవారం ప్రచురితమైన వార్త కథనాన్ని మూసీ ప్రాజెక్టు అధికారులు హైదరాబాద్‌లో జరిగిన స్కైవమ్ సమావేశం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలు, ఆయకట్టులో పంటల సాగుకు ఎంత మేర నీరు అవసరమవుతుంది. రాబోయే రోజుల్లో ఎగువ నుంచి వచ్చే నీటి వివరాలపై మూసీ అధికారులతో సమీక్షించిన స్కైవమ్ అధికారులు ఆయకట్టుకు సాగునీటి విడుదలకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే మూసీ నీటి విడుదలలో సెంటిమెంట్ నెంబర్‌గా ఉన్న 18ని కొనసాగించే చర్యల్లో భాగంగా మూసీ అధికారులు ఈ నెల 18 నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. కొన్నేళ్లుగా మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు యాసంగిలో డిసెంబరు 18వ తేదీన సాగునీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇదే ఆనవాయితీని ఈ ఏడాది వానాకాలం కూడా అమలు చేయనున్నట్లు తెలుస్తుంది. ఈలోగా ఎగువన సరైన వర్షాలు కురిస్తే వచ్చే వరదలతో ప్రాజెక్టు నీటిమట్టం మరో అడుగు పెరిగి 642 అడుగులకు చేరుతుంది. గత ఏడాది వానాకాలంలో సైతం ప్రాజెక్టు నీటిమట్టం 642 అడుగులకు చేరిన తర్వాత జూలై 25వ తేదీన ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న మూసీ అధికారులు ఈ నెల 18వ తేదీ వరకు వేచి చూసి 18న ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది.



మూసీ జలాశయం

నేడు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

నల్లగొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో సోమవారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయడం జరుగుతుందని ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ వేణుగోపాలచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ రోడ్డు బీటీఎస్, దుర్గా కాలనీ, కలెక్టరేట్, ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, శివాలయం, డైట్ ఎదురుగా ఉన్న కాలనీల్లో 11 కేవీ లైన్ షిఫ్ట్ కోసం కరెంట్ బంద్ చేయనున్నట్లు తెలిపారు.

ఈవోపై దాడి హేయమైన చర్య

నల్లగొండకల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడి హేయమైన చర్య అని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దోసోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెందోట సోము ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈవోపై దాడికి పాల్పడిన బాధ్యులపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకొని, ధర్మాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలను తీవ్రంగా ఖండించారు.

సమాచారం

పోటాపోటీగా లారీ ఓనర్ల అసోసియేషన్ రెండువర్గాల కార్యవర్గం ఎన్నిక

చిట్యాలరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిట్యాల లారీ ఓనర్స్ అసోషియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం రెండువర్గాలు పోటీపోటీగా ఎన్నుకున్నాయి. లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. వారికి వరాఏ పోటీపోటీగా ఒక వర్గం తర్వాత మరోవర్గం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నాయి. ఒక వర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా పాటి దివాకర్‌రెడ్డి, అక్కెనపల్లి గణేష్, కోశాధికారిగా మండడి భగవాన్‌రెడ్డిలతో పాటు గౌరవ అధ్యక్షుడు, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు. మరో వర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా జగిని బిక్షంరెడ్డి, ఆవుల మల్లేష్‌యాదవ్, కోశాధికారిగా గురిజ జంగయ్యగౌడ్‌తో పాటుగా గౌరవ అధ్యక్షుడు, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఒక వర్గం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసేందుకు వెళ్లారు. ఇరువర్గాల్లో ఏ కార్యవర్గం ఉండాలో ఎమ్మెల్యే తేల్చనున్నట్లు తెలిసింది.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ



శాలిగౌరారం మీ సేవలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

- మీసేవ కేంద్రాలకు పరుగులు
- కార్డుల కోసం పదేళ్లుగా నిరీక్షణ

శాలిగౌరారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం పదేళ్లుగా నిరీక్షిస్తున్న లబ్ధిదారులకు ఊరట లభించింది. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చే ప్రక్రియను మొదలు పెట్టడంతో దరఖాస్తు చేసేందుకు మీ సేవ కేంద్రాలకు అర్హులు క్యూ కడుతున్నారు. దీంతో మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయానికి బారులు కడుతున్నారు. గత జనవరి నెలలో జరిగిన కులగణన సర్వేలో లబ్ధిదారులను గుర్తించి జాబితాలను గ్రామ సభల్లో ప్రదర్శించారు. ఇందులో చాలామంది పేర్లు లేపోవడంతో మళ్లీ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అయితే తాజాగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు పౌరసరఫరాల శాఖ అవకాశం కల్పించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుదారుల హడావుడి ఏర్పడింది. గతంలో శాలిగౌరారం మండలంలో 13,915 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇటీవల మీసేవలో 1725 మంది దరఖాస్తులు చేసుకోగా, రెవెన్యూ అధికారులు అసలైన లబ్ధిదారులను గుర్తించి 1506 కార్డులు జారీ చేశారు. రేషన్‌కార్డుల్లో తమ పిల్లల పేర్లు లేకపోవడంతో పాటు వివాహాలు జరిగి కొత్తగా ఇళ్లకు వచ్చిన కోడళ్ల పేర్లు చేర్పులకోసం ఇన్ని రోజులు ఆరాటపడినవారికి కూడా కుటుంబ సభ్యులలో చేర్పుల, మార్పుల కోసం అవకాశం కల్పించారు. మార్పులు, చేర్పుల కోసం 2420 మంది చేసుకోగా 2307 మందికి కార్డులు వచ్చాయి. ఇంకా ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెల 14న తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రేషన్‌కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ



రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతర కొనసాగుతుంది. కార్డు లు రాలేదని ఎవరూ ఆందోళ న చెందవద్దు. అర్హులైన వారు మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించిన వెంటనే ఇస్తాం. నిబంధనలకు అనుగుణంగా నూతన రేషన్ కార్డుల ప్రక్రియ ఉంటుందని, కుటుంబ సభ్యుల చేర్పులు, మార్పులు కూడా చేస్తామన్నారు. ఎక్కడైతే ఆధార్ కార్డు ఉంటుందో ఆ చిరునామా ప్రకారమే రేషన్‌కార్డు ఇస్తాం.

- షేక్ జహీరుద్దీన్,తహసీల్దార్, శాలిగౌరారం

పదేళ్ల నిరీక్షణ నెరవేరింది



రేషన్‌కార్డులో మా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం కోసం పదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం నూతనంగా అర్హులైన వారికి రేషన్‌కార్డుల కోసం, చేర్పుల, మార్పుల కోసం అవకాశం కల్పించింది. దీంతో నేను వెంటనే మా కుటుంబ సభ్యుల పేర్లను మీ సేవలో దరఖాస్తు చేయగా అధికారుల పరిశీలించి మా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చారు. నాకు ఎంతో ఆనందంగా ఉంది.

- వీరేంకుల మహేష్, రేషన్‌కార్డు లబ్ధిదారుడు, మనిమిద్దె, శాలిగౌరారం

ఆర్యవైశ్య సంఘం

రాజకీయ సదస్సు రేపు

నల్లగొండరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో నెల 15వ తేదీన ఆర్యవైశ్య సంఘం రాజకీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాస్, ఆర్యసంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ అభిప్రాయాలను చర్చించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల జాబితా సమావేశంలో రూపొందించనున్నామని తెలిపారు.

ఈ సమావేశాన్ని ముఖ్యమైన సమావేశంగా భావించి ఆ ర్యవైశ్య సంఘం మాజీ ప్రజాప్రతినిధులు ఎంపీపీలు, జడ్పీటీసీలు, మునిసిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ మండలాల ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో వారి అభిప్రాయాలను చెప్పుకోవాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యుల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పరడ, మునుకుంట్ల, ఈదులూరు, నారగూడెం, నల్లకుంటబోలు గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. విడతల వారీగా ఇల్లులేని ప్రతీ పేదకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామన్నారు. నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, ఐతగోని నారాయణ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, నంద్యాల వెంకట్‌రెడ్డి, గడుసు శంకర్‌రెడ్డి, నూకల శ్రీధర్‌రెడ్డి, చెనగోని రవి తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూరు: మునుకుంట్లలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

తొలి విడత రాకున్నా మలి విడత ఇప్పిస్తా

నార్కట్‌పల్లి: అన్ని అర్హతలు ఉన్నా ఏ కారణం చేతనైనా తొలి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని వారికి మలి విడత తప్పకుండా ఇల్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అభయమిచ్చారు. నార్కట్‌పల్లి మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 414 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో అర్హులైన కొందరు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని ఎమ్మెల్యే వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే తన ధ్యేయమని పునరుద్ఘాటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇళ్లయినా కట్టిచ్చిందా ప్రజలే ఆలోచించుకోవాలని అన్నారు. కనీసం కట్టిన డబుల్ బెడ్ రూంలను కూడా పంపిణీ చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. విడతల వారీగా ఇల్లులేని ప్రతీ పేదకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామన్నారు. మళ్లీ గృహప్రవేశానికి వచ్చి మీ ఇంట విందు భోజనం చేస్తానని లబ్ధిదారులను వీరేశం ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, పున్నంరాజు యాదగిరి, జెరిపోతుల భరత్, సిద్దగోని స్వామిగౌడ్, కొండయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, సైదులు, సమద్, దొండ రమేశ్, రాజు, నరేందర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, పశుపతి, ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్, ఏఈ ఇందు పాల్గొన్నారు.

అయిటిపాముల రిజర్వాయర్‌కు నీటి విడుదలపై హర్షం

కట్టంగూరు: మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఉన్న రిజర్వాయర్‌కు పానగల్లు ఉదయసముద్రం నుంచి నీటిని విడుదల చేయడాన్ని ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతులు నకిరేకల్‌లోని ఎమ్మెల్యే వేముల వీరేశం ఇంటి వద్ద ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతుల గురించి ఆలోచించే ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెజవాడ సైదులు, ముత్యాల లింగయ్య, వార్డు మాజీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి డిపో దత్తతపై హర్షం

● మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



నార్కట్‌పల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోను దత్తత తీసుకుని పూర్వవైభవం తెస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వేముల వీరేశంల ఫ్లెక్సీకి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, జెరిపోతుల భరత్‌గౌడ్, సిద్దగోని స్వామిగౌడ్, ఎస్‌కే సమద్, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, లింగాల రాములు, అజీజ్, సంపత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో చెట్ల తొలగింపు



కాల్వలో మట్టిని తొలగిస్తున్న సైదులు, రైతులు

కట్టంగూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గ్రామంలోని ఎస్ఎల్‌బీసీ కాల్వలో పిచ్చి మొక్కలను ఆదివారం తొలగించారు. ఎస్ఎల్‌బీసీ కాల్వ నుంచి రసూల్‌గూడెం - రామచంద్రాపురం వెళ్లే కాల్వ మట్టి, కంపచెట్లతో కూరుకుపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లోని కుంటలలోకి నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులుకు ఈ విషయాన్ని వివరించారు. వెంటనే మాజీ చైర్మన్ స్పందించి ఆదివారం ఉదయం తన సొంత ఖర్చులతో దగ్గర ఉండి ఎక్స్‌కవేటర్ సహాయంతో కూరుకుపోయిన మట్టితో పాటు కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో రైతులు చెవుగోని తిరుమలేష్, గోపగోని యాదయ్య, అనంతుల సతీష్, విజయ్, బొడ్డుపల్లి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కార్యాలయంపై దాడికి నిరసన

నల్లగొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ పలువురు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వైద్యుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే దాడి వెనక ఉన్న సూత్రధారులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇదే విధంగా బీసీలపై దాడులు కొనసాగితే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ కవిత అనుచరులపై చర్య తీసుకోవాలి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి చేసిన జాగృతి కార్యకర్తలు, ఎమ్మెల్సీ కవిత అనుచరుల మీద తక్షణమే కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యాలయంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర నాగరాజు, ఎలిజాల వెంకటేశ్వర్లు, చేరి రవీందర్, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

తీన్మార్ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల ప్రతినిధిగా నిస్వార్థంగా పనిచేస్తున్న మల్లన్న కార్యాలయంపై దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నల్ల సోమ మల్లయ్య, నకిరేకంటి కాశయ్యగౌడ్, కేశబోయిన శంకర్, వెంకటనర్సయ్య, శ్యాంసుందర్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బీసీ నేతలు

మునుగోడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపటంపై బీసీ విద్యార్థి, యువజన సంక్షేమ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బూడిద మల్లికార్జున్‌యాదవ్, పానుగంటి విజయ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఆదివారం సంఘం ప్రతినిధులు, అనుబంధ సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లలో స్థానం కల్పించటం ద్వారా సముచిత న్యాయం దక్కనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాధికారంతో భవిష్యత్తు మనుగడ సాధ్యమని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిట్యాలరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన ఇస్మాయిల్ అనారోగ్యంతో మృతిచెందడంతో పూర్వవిద్యార్థులు ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఇస్మాయిల్ అనారోగ్యంతో మృతిచెందగా పెద్దకాపర్తి జడ్పీహెచ్ఎస్ 2002 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు రూ.66వేలను సేకరించి స్నేహితుడి కుమార్తెల పేరుపై పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రామ్మూర్తిలు పూర్వవిద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలబడటం ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థులను అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

మునుగోడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే సీపీఐ 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను కోరారు. మునుగోడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులతో పాటు పార్టీ అభిమానులు, ఇతర వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

నల్లగొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నల్లగొండలో బీసీఐఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ కేబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుంటా కేంద్ర ప్రభుత్వం 9 షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్లు నకిరేకంటి కాశయ్య, అంజయ్య, చంద్రశేఖర్, షణ్ముఖాచారి, చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బాంధవుడు

శాలిగౌరారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నూక కిరణ్ కుమార్‌యాదవ్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ముఖ్యమంత్రి నివాసంలో కిరణ్‌కుమార్ యాదవ్ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. బీసీ కులగణను 100శాతం డిజిటలైజేషన్ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి సురేఖ బీసీ సంఘాల నాయకులతో కలిసి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

● మర్రిగూడలో కంటి వైద్య శిబిరం

మర్రిగూడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఆవరణలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 900 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 230 మందికి కంటిచూపులోపం ఉందని గుర్తించారు. వీరిలో మొదటి విడతగా 129 మందికి, రెండో విడత 101 మందికి హైదరాబాద్‌లోని గచ్చిబౌలీలో శంకర కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. అలాగే కంటి అద్దాలను అందించడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తానని చెప్పారు. శిబిరంలో ఫౌండేషన్ బృందం నిర్వాహకులు, కంటి వైద్య నిపుణుల బృందం, మాల్ మార్కెట్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, రమావత్ భీమా నాయక్, నాయకులు రమావత్ శ్రీనివాస్‌నాయక్, మేతరి యాదయ్య, పాశం సురేందర్ రెడ్డి, మాస నీలిమ చంద్రశేఖర్, రవీందర్‌రావు, జయపాల్ రెడ్డి, గ్యార వెంకటేష్, కొడాల వెంకట్ రెడ్డి, సిరిపంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మౌలిక వసతులు కల్పించాలి

మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల కొరత, టాయిలెట్స్, మౌలిక వసతుల కల్పించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి విద్యార్థినులు మొరపెట్టుకున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడి పాఠశాల సమస్యలపై సిబ్బందిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పా టు చేశారని, దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉం డడం వల్ల గదుల కొరత, పడుకోవడానికి సరిపడా గదులు లేవని తెలిపారు. ఒక్కొక్క గదిలో 60 మంది విద్యార్థులు ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. అలాగే టాయిలెట్స్, గ దుల కొరత ఉందని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీంతో ఎమ్మెల్యే సొంత డబ్బుతో అదనపు తరగతు లు, టాయిలెట్స్ నిర్మించి, మౌలిక వసతులు కల్పించి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే వ్యక్తిగత ఇంజనీరింగ్‌తో మాట్లాడి రేపటి నుంచి ప నులు ప్రారంభించాలని వారికి ఆదేశించారు. కొంతసేపు విద్యార్థినులతో కలసి సరదాగా గడిపాడు. అనంతరం కేజీబీవీలో 2024-25వ సంవత్సరంలో పదో తరగతిలో 500మార్కులకు పైగా సాధించిన విద్యార్థినులకు రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10వేలు తృతీయ స్థానం రూ.7,500 నగదు బహుమతులు అందజేసి శాలువాలతో కప్పి సన్మానించారు. అలాగే 2026 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలు 500 పైగా మార్కులు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి, శోభ రాణి, సత్తమ్మ, నరసమ్మ, ఉపాధ్యాయుల సిబ్బంది, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, సిరిపంగ శ్రీనివాస్, పాక నగేష్, అయితగోని వెంకన్నగౌడ్, కుమ్మరి శ్రీనివాస్‌రెడ్డి, జగాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ విద్యార్థినులను సన్మానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

పెయింటింగ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి

నల్లగొండ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెయింటింగ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సమావేశంలో వారు మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెయింటింగ్ కార్మికులకు ఇస్తున్న రేట్లు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆగస్టు 1వ తేదీ నాటికి నూతన రేట్లు నిర్ణయించి అమలుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా 1వ తేదీ పనిబందు ఖచ్చితంగా అమలు చేయాలని, కార్మికులంతా పనివేళలు పాటించాలని కోరారు. సభ్యత్వం కలిగిన పెయింటర్ కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబానికి యూనియన్ నుంచి రూ.5వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. పెయింటింగ్ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడం కోసం యూనియన్ కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. యూనియన్ అధ్యక్షుడు భీమనపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ అవుట రవీందర్, యూనియన్ గౌరవ సలహాదారుడు కత్తుల జగన్, కార్యదర్శి దుప్పలపల్లి శంకర్, కోశాధికారి బైరు నరసింహ, ఉపాధ్యక్షుడు బుషిపాక యాదగిరి, నాయకులు జానీ, చరణ్, వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● సోమవారం 14 జూలై 2025

శ్రీనివాస్‌రావు మృతి సినీ పరిశ్రమకు లోటు

చింతపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కోట శ్రీనివాస్‌రావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని మాజీ ఎంపీపీ కొండూరి భవానీఎవన్‌మార్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో ఆమె పాల్గొన్నారు. వేలకు పైగా సినిమాల్లో పాల్గొని తనదైన శైలిలో పాత్ర పోషించి అభిమానుల్లో ఆనందం నింపేవారన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

హాలియా, జూలై13(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల, నాయకుల సమావేశాన్ని సోమవారం హాలియాలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నివాసంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే భగత్ హాజరుకానున్నందున బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిపాదనలకే పరిమితం

దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఓపెన్ ఎయిర్ జైలు పనులు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఏళ్లు గడుస్తున్నా ఒక అడుగు కూడా ముందుకు పడడం లేదు. జైలు ఏర్పాటైయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీంతో స్థానికులు జైలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
(ఆంధ్రజ్యోతి- దేవరకొండ)

» ముందుకు సాగని ఓపెన్ ఎయిర్ జైలు పనులు » స్థలాన్ని జైళ్లశాఖకు కేటాయించిన రెవెన్యూశాఖ


నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో ఓపెన్ ఎయిర్ జైలుకు కేటాయించిన స్థలం ఇదే

నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి సొంత మండలం నేరేడుగొమ్ము కావడంతో ఓపెన్ ఎయిర్ జైలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. పెద్దమునిగల్‌లో సర్వేనంబర్ 299లో 350 ఎకరాల వరకు సర్వే చేశారు. ఓపెన్ ఎయిర్ జైలు నిర్మాణానికి 289 ఎక రాలను జైళ్లశాఖకు కేటాయిస్తూ రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది. జైళ్ల, రెవెన్యూశాఖ అధికారులు జైలు ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారు. కానీ జైలు ప్రతిపాదనలకే పరిమితమైంది. అప్పటి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మృతి చెందడంతో జైలు ప్రతిపాదనలకే పరిమితమైంది. స్థానిక నాయకుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుపడింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తర్వాత కూడా జైలు నిర్మాణంపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జైలు నిర్మాణం పూర్తయితే పెద్దమునిగల్ ప్రాంతం అభివృద్ధి చెందనుంది. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ దగ్గరగా ఉండడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో జైలు నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించింది.

జైలు ఏర్పాటు చేస్తే అభివృద్ధి:

పెద్దమునిగల్‌లో ఓపెన్ ఎయిర్ జైలు ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ఏకో టూరిజం, పెద్దమునిగల్‌లో ఓపెన్ ఎయిర్ జైలు, అంబభవాని ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే మండలం అభివృద్ధి చెందుతుందని, పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓపెన్ ఎయిర్ జైలుకు నిధులు కేటాయించి ఏర్పాటు చేయాలని, దీంతో పాటు ఏకోటూరిజం పనులను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఖైదీలకు స్వయం ఉపాధి

చర్లపల్లి కారాగారంలో పెరుగుతున్న అవసరాల మేరకు అక్కడ అనువైన పరిస్థితి తగ్గుతుండడంతో పెద్దమునిగల్ కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జైళ్లలో వ్యవసాయ పనులతో ఖైదీలకు స్వయం ఉపాధి కల్పించాలని సంకల్పించారు. నాగార్జున సాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో నీటి సమ స్య ఉండదు. దీంతో ఇక్కడ పెద్దఎత్తున వ్యవసాయ క్షేత్రాన్ని అభివృద్ధి చేసి వనమూలికలు, కూరగాయలు, పండ్ల తోటలు పెంపకం చేయాలని దీంతోపాటు పాడి పరిశ్రమను కూడ అభివృద్ధి చేయాలని సంకల్పించారు.

తహసీల్దార్ ఏమన్నారంటే..

ఈ విషయమై నేరేడుగొమ్ము తహసీల్దార్ ఉమాదేవిని వివరణ కోరగా పెద్దమునిగల్‌లో 299 సర్వేనంబర్‌లో సర్వే చేసి 289 ఎకరాలను జైళ్లశాఖకు గతంలోనే ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ముకుందాపురం వాసికి డాక్టరేట్


లావణ్య

నిడమనూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన గండికోట లావణ్యకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. భౌతికశాస్త్రంలో 'స్ట్రక్చరల్ అండ్ అప్టికల్ ప్రాపర్టీస్ ఆఫ్ గ్రాఫెన్ బేస్డ్ నానో కాంపోజిట్స్' అనే అంశం మీద ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. లావణ్య ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. భర్త శివరాజ్ ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించిన లావణ్య ఎమ్మెస్సీలో అప్పటి గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ కూడా అందుకున్నారు. ఓయూ నుంచి డాక్టరేట్ రావడం పట్ల సంతోషిస్తూ, తండ్రి, భర్త ప్రోత్సాహంతోనే ఓయూలో ఫిజిక్స్‌లో పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించినట్లు ఆమె తెలిపారు. లావణ్యకు డాక్టరేట్ రావడం పట్ల ముకుందాపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.ఆమె తండ్రి వెంకన్న డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు .లావణ్యకు డాక్టరేట్ రావడం పట్ల ముకుందాపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

బీసీలకు రిజర్వేషన్లపై సీఎం రేవంత్ సంకల్పం చరిత్రాత్మకం

హాలియా, జూలై13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం చరిత్రాత్మకమని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం అమలుకు పంచాయతీ చట్టం- 2018 సెక్షన్ 243డి(6) ఆర్డినెన్స్ ద్వారా సవరణ చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని కసరత్తు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. రిజర్వేషన్ల అమలులో కోర్టులో ఏమైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ఎదుర్కొవడానికి అన్ని పార్టీలు సహకరించి బీసీల అభివృద్ధి సహకరించాలని కోరారు. ఈనెల 21 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. తెలంగాణలో బీసీ జనామా 56 శాతం పైచిలుకు కావున కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డిమాండ్ న్యాయపరమైనదని తెలిపారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి


దేవరకొండ సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

దేవరకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోఏఐ సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించనున్న సీపీఐ 23వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ దేవరకొండ పట్టణ కార్యదర్శి వలమాల అంజనేయులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలోనిర్వహించిన పట్టణశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యలపై సీపీఐ ప్రజలపక్షాన పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి జూలూరి జ్యోతిబసు, సీపీఐ నాయకులు వెంకట్రాములు, తోటపల్లి నగేష్, మైనొద్దీన్, కందుకూరు శ్రీను, వెంకటయ్య పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కమిటీ ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌గౌడ్


శ్రీనివాస్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

దేవరకొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం నాగార్జునసాగర్, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల ఆర్గనైజింగ్ కమిటీ ఇన్‌చార్జిగా దేవరకొండకు చెందిన చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థాగత నిర్మాణ కమిటీల ఏర్పాటు, రిజర్వేషన్లపై పోరాటం చేసే దశగా ముందుకు వెళ్లాలని ఆర్.కృష్ణయ్య సూచిస్తున్నట్లుశ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చట్టసభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలుచేసేంత వరకు పోరాడుతామని తెలిపారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి హేయం


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ యూట్యూబ్ ఛానెల్‌పై దాడి హేయమని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూ న్యూస్ చానల్, తీన్మార్ మల్లన్నపై ఎమ్మెల్సీ కవిత అనుచరులు విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని బీసీలందరూ ఖండించాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టనీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు దాసరాజు జయరాజు, సిద్ధం రాజు, నాయిని భాస్కర్, బోయిన ఉపేందర్, గంగాధర్, అంజి, సుదర్శన్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నిడమనూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్‌నగర్‌లో బంగారు మైసమ్మ గుడి వద్ద బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గుడి నిర్వాహకులు మేక సాయిప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అం జయ్య, ఉన్నం చిన వెంకటేశ్వర్లు, రాయపాటి పరయ్య, గ్రామస్థులు నేమాని ప్రకాష్‌రావు, బలుసు సుబ్బారావు, ఈదర రాము, బీమేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, బొల్లిన సు బ్బారావు, విశ్వనాధ చౌదరి, నేమాని శ్రీను, నిడదవోలు వాసులు, గన్నమని శ్రీనివాస్‌రావు, బాబురావు, సూర్యానారాయణ, వీరభద్రరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారు

అప్పుడు నాటారు..ఇప్పుడు నరికారు

● అనాలోచితంగా నాడు మొక్కలను నాటించిన అధికారులు ● వృథా అవుతున్న ప్రజాధనం

వేములపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన విద్యుత్ లైన్ల కింద మొక్కలను నాటడం... అవి పెరిగిన తరువాత నరకడం పరిపాటిగా మారింది. నాటి అధికారుల అనాలోచిత నిర్ణయంతో మానవ శ్రమ, ప్రజాధనం రెండు వృథా అవుతున్నాయి. మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట అధికారులు పాత విద్యుత్ వైర్లను, స్తంభాలను సరిచేయడంతోపాటు కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సి రావడంతో రహదారి వెంట అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారడంతో వాటిని శనివారం నరికివేశారు. దీంతో రహదారి వెంట చెట్లు నేలవాలి బోసిపోయి ంది. దీంతో వన మహోత్సవంలో భాగంగా చెట్లను పెంచడం పర్యావరణ పరిరక్షణ లేక నరికివేసేందుకా అన్నట్లు పరిస్థితి ఉందని పలువురు పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. మొక్కలను నాటి పెద్దగా చేసేందుకు పెట్టిన ఖర్చు ఇలా వృథా అవుతున్నాయి. అధికారులు ఆలోచన చేయకుండా మొ క్కలను నాటడమే లక్ష్యంగా రోడ్లపక్కన విద్యుత్ లైన్ల కింద మొక్కలను నాటడం వల్ల నే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయాశాఖల అధికారులు సమన్వయంతో మొక్కలను నాటేడప్పుడే వాటికి అనువైన ప్రదేశాలను గుర్తించి నాటినట్లయితే ఇలా నేడు మొక్కలను విద్యుత్‌శాఖ అధికారులు నేలవాల్చే పరిస్థితి ఉండేదికాదని పలువురు పేర్కొంటున్నారు.


నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట విద్యుత్‌శాఖ అధికారులు కొట్టించిన చెట్లు


బోసిపోయి మొద్దులుగా మారిన హరితహారం మొక్కలు


బ్లాక్ స్పాట్‌ల వద్ద రేడియం స్టడ్స్ ఏర్పాటు


దయ్యాలగండి వద్ద రేడియం స్టడ్ ఏర్పాటు చేస్తున్న పోలీస్ సిబ్బంది

నాగార్జునసాగర్,జూలై13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు వచ్చే జాతీయ రహదారిపై ఉన్న ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద ఆదివారం సాగర్ సీఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో రేడియం స్టడ్స్ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను ఈ నెల 11వ తేదీన ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నివేదికలు ఇవ్వాలని అలాగే జాతీయ రహదారిపై ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. దీంతో ఆదివారం సాగర్ దయ్యాలగండి, డౌన్ పార్కు, బొవదల గడండల వద్ద మూల మలుపుల వద్ద రేడియం స్టడ్స్ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో హోం గార్డు మృతి


కిషన్ నాయక్ పాడె మోస్తున్న సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య


కిషన్ నాయక్

నాగార్జునసాగర్, జూలై13 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. నాగార్జునసాగర్ హిల్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అంగోతు కిషన్ నాయక్ (43)కు గుండె పోటు వచ్చింది. దీంతో ఆయన వెంటనే బైక్‌పై స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స పొం దుత చనిపోయాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తన తోటి సిబ్బందితో పాటు, మృతుడి స్వగ్రామంలో బంధువులు స్నేహితులు శోక సంద్రంలో మునిగారు. అందరితో కలిసిమెలిసి ఉండే తోటి ఉద్యోగి హఠన్మరణం చెందడంతో సిబ్బంది అంతా తీవ్ర విచారం వ్యక్తం చేశా రు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నా రు. అంత్యక్రియల్లో పాల్గొన్న సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య పాడే మోశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చింతపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని చింతపల్లి ఎస్ఐ ఎం.రామూర్తి తెలిపారు. మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ చెక్ పోస్టు సమీపంలో హైవేపై వెళ్లే వాహనాలపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11 మంది మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారని గమనించి వారిపై కేసులు నమోదు చేశారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ సైదులు, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

16న మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు సన్మానం


సన్మాన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవూర, జూలై 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఈనెల 16న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు నిర్వహించే ఆత్మీయ సన్మానం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సన్మాన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ శ్రేణులు , అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదమల్ల సత్యానారాయణ, దండెం కొండలు, ఆదిమల్ల శేఖర్, రేపాక ఎల్లయ్య, ఆదిమల్ల యశోద, జానమ్మ, ఈదమ్మ, దేవి, కాశమ్మ, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆటల్లేవ్..ఆడుకోవడాల్లేవ్

» బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు
» ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు దర్శనం

చింతపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అయ్యాయి. కొన్ని చోట్ల క్రీడ స్థలాలు గుట్టల్లో రాళ్ల మధ్య ఏర్పాటు చేయడంతో వాటిని నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆట సామగ్రి పూర్తిగా సమకూర్చకపోవడంతో క్రీడాకారులు అటువైపు వెళ్లడం లేదు. చింతపల్లి మండలంలోని 34 గ్రామపంచాయతీలకు 15 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కేవలం స్థలం ఉండటంతో బోర్డును ఏర్పాటు చేశారు. తప్ప క్రీడలకు ఎలాంటి ఉపయోగంగా లేదు. మరికొన్ని చోట్ల గుట్టలో ఏర్పాటు చేసి అధికారులు నేటికి ఎలాంటి పనులు నిర్వహించ చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అవి చాలా చోట్ల బోర్డులకే పరిమితమయ్యాయి.

పల్లె ప్రగతిలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ క్రీడ ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో ఇప్పటి వరకు క్రీడ సామగ్రి కూడా ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడ ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



పాలెంతండాలో అలంకార ప్రాయంగా మారిన క్రీడా ప్రాంగణం

వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు



క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారడానికి గ్రామాల్లో పిల్లలు ఎవరూ రావడం లేదు. అందుకే ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల భూమిని మాత్రమే కేటాయించాం. చదును చేయడానికి నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలోనే క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

- సుజాత, ఎంపీడీవో, చింతపల్లి

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : మార్గన్ / వెంకటేశ్వర: కన్నప్ప / రాఘవ: కుబేర / విట్రోస్: కుబేర, మార్గన్, దేవరకొండ: మనోజ్ : కుబేర మైత్రి వెంకటేశ్వర : కన్నప్ప